జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 14-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 425 పేజీలు: 4 వెల : రూ.7




# రోగాలు.. కొని తెచ్చుకుంటున్నారు!

* ప్రజారోగ్యం గాలికొదిలేసిన హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు * కనీస నిబంధనలు పాటించని నిర్వాహకులు * తనిఖీలు చేయడం అధికారులు విఫలం * వ్యాధుల బారిన జిల్లావాసులు * హెూటళ్లలో గృహ సిలిండర్ల వాడకం

**శ్రీకాకుళం, ఆగస్టు 13 (వార్త):** శ్రీకాకుళం జిల్లాలోని హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిర్వాహకులు కనీస నిబంధనలు పాటించడం లేదు. హెూటళ్లలో కనీస శుభ్రత ఉండడం లేదు. వంటలు చేసే ప్రాంతం చూస్తే హెూటళ్లలో ఇంకెప్పుడూ తినకూడదు.. అనే అభిప్రాయానికి ప్రజలు రాకమానరు. హెూటళ్లలో కనీస ప్రమాణాలు పాటించరు. నాణ్యత అస్సలే ఉండదు. మిగులు ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లలో ఉంచి ఆ తర్వాత రోజు మళ్లీ వేడి చేసి విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో మూడు అంకెల సంఖ్యలోనే చిన్నా పెద్దా హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. అడుగడుగుకో టిఫిన్ సెంటర్ దర్శనమిస్తోంది. హెూటళ్లలో చేతులను శుభ్రం చేసుకోవడానికే తప్ప తాగేందుకు మినరల్ వాటర్‌ను అందుబాటులో ఉంచడం లేదు. హెూటళ్లలో తినేవారు తప్పనిసరిగా వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. వంటల్లో వాడే నూనె నల్లగా మాడిపోయివుంటుంది. పాత్రలు, ప్లేట్లను వేడినీటిలో కడగాల్సివున్నా, ఏదో అలాఅలా సబ్బు నీళ్లలో కడిగేసి వాటినే వాడుతుంటారు. వాటిని చూస్తే టిఫిన్ తినబుద్ధి కాదు. కనీస శుభ్రత పాటించరు. ఆ ప్రదేశం కంపుకొడుతూ ఉంటాయి. ఇవన్నీ తెలియక ప్రజలు రోగాలు కొనితెచ్చుకుంటున్నారు.

## ఆహార తనిఖీ అధికారులు ఎక్కడ?

హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. ఆహార తనిఖీ అధికారుల జాడ కనిపించడం లేదు. అధికారులు కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారు. అసలు కార్యాలయం ఎక్కడ ఉందో ఎవరికీ తెలియదు. కనీసం నెలకోసారైనా హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేస్తే వాటిలో ఎంతోకొంత మార్పు వచ్చేది. అసలు అటువంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మాత్రం అలా వెళ్లి.. ఇలా వచ్చేస్తుంటారు.



## హెూటళ్లలో గృహ సిలిండర్ల వాడకం..

హెూటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో యదేచ్ఛగా గృహ సిలిండర్లను వినియోగిస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు సైతం వారికి గృహ సిలిండర్లను వాణిజ్య సముదాయాలకు హెూటల్స్‌కు, డాబాలకు సప్లై చేస్తున్నారు. పట్టించుకోవలసిన సివిల్ సప్లై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల గృహ సిలిండర్లు దుర్వినియోగం అవుతున్నాయి.

## ఉత్సాహంగా
# శ్రీకాకుళం వజ్రోత్సవాలు

* నగరంలో వాక్‌థాన్ ర్యాలీ * శ్రీకాకుళం 75 ఏళ్ల ప్రస్థానాన్ని తెలుసుకోండి * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * 75 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం.. గర్వంగా చేసుకుందాం * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * కేఆర్ స్టేడియంలో స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్, ఎగ్జిబిషన్ ప్రారంభం * ధగధగ మెరుస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు, జంక్షన్లు



**శ్రీకాకుళం, ఆగస్టు 13(వార్త):** శ్రీకాకుళం జిల్లా 75వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజులపాటు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలతో కలిసి పండగ వాతావరణంలో వజ్రోత్సవాలను నిర్వహించడానికి సంకల్పం చేసుకున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఏడు రోడ్ల కూడలి వరకు నిర్వహించిన వాక్‌థాన్ ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు, యువత గత 75 ఏళ్ల ప్రస్థానం తెలుసుకోవాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బుధవారం ప్రారంభమైన ఈ వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవం ముగింపు కార్యక్రమాల వరకు కొనసాగుతాయనీ, ఇందులో భాగంగానే వాక్‌థాన్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడం సంతోషకరమన్నారు. కోడి రామ్మూర్తి స్టేడియంలో ఎగ్జిబిషన్‌ను అందరూ తిలకించాలని, ముఖ్యంగా భవిష్యత్ తరాలకు ఇది జిల్లా ఔన్నత్యాన్ని తెలుసుకోవడానికి ఒక మంచి అవకాశం అని వివరించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ మన జిల్లా 75 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని గర్వంగా చేసుకుంటోందన్నారు. ఇది చరిత్ర, సంస్కృతి, ఐక్యతకు ప్రతీకని చెప్పారు. భవిష్యత్తులో శ్రీకాకుళం మరింత అభివృద్ధి చెందాలన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ రావు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు కలిసి కమిటీగా ఏర్పడి, శ్రీకాకుళం జిల్లా 75వ వసంతాల వేడుకలను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇళ్లే టార్గెట్

* ఉదయమంతా రెక్కీ.. రాత్రయితే చోరీ
* ముఠాను పట్టుకున్న బారువా పోలీసులు

**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 13 (వార్త):** పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ముఠా ఉదయమంతా బిచ్చగాళ్లుగా తిరుగుతూ, తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకుంటూ రాత్రయితే చోరీకి పాల్పడుతున్నారు. ఈ ముఠాను బారువా పోలీసులు పట్టుకున్నారు. సోంపేట సీఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబునాయుడు అందించిన వివరాలిలా ఉన్నాయి. కొర్లాం గ్రామానికి చెందిన తూగా బాలమ్మ, గార వాణి ఇళ్లకు తాళం వేసి ఉండడంతో గతనెల 28న చోరీకి పాల్పడ్డారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పరిశీలించి అనుమానితులపై నిఘా ఉంచారు. బుధవారం ఉదయం పాలవలస వద్ద ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి పారిపోయేం దుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి వారిని పట్టుకుని విచారణ చేపట్టారు. దీంతో వారు తామే దొంగతనాలకు పాల్పడినట్టు ఒప్పు కున్నారు. వీరిద్దరూ పశ్చిమబెంగాల్‌కు చెందిన మోనిక సింగ్, సోయిదా సింగ్‌లు. ఈ మేరకు వారిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

## నేలబావిలో ఎలుగుబంట్లు



**కోటబొమ్మాళి, ఆగస్టు13 (వార్త):** మండలంలోని చలమయ్యపేట వ్యవ సాయ నేల బావిలో రెండు ఎలుగుబంట్లు ప్రమాదవ శాత్తు పడిపోయాయి. బుధవారం సాయంత్రం నేల బావి నుంచి శబ్దాలు విన్న స్థానికులు కొందరు చూడగా ఎలుగుబంట్లు కనిపించాయి. వెంటనే వారు అటవీ అధికారులకు తెలియజేశారు. టెక్కలి అటవీ రేంజ్ అధికారి జగదీశ్వర రావు, సబ్ డీఎఫ్‌వో నాగేంద్రరావు, సిబ్బంది హుటాహుటిన చలమయ్యపేటకు చేరుకున్నారు. బావిలో పడిన ఎలుగుబంట్లకు కాపాడేందుకు చర్యలు చేపట్టారు. బావిలోకి నిచ్చెనలు వేశారు. దీంతో ఆ రెండు బంట్లు పైకెక్కి సమీపంలోని కొండల్లోకి పరుగుపెట్టాయి.

# కేజీబీవీ ప్రిన్సిపాల్స్ అక్రమ బదిలీలు రద్దు చేయండి

* ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్, యుటిఎఫ్ నేతలు * సమగ్ర శిక్ష కార్యాలయం ముందు ధర్నా

**శ్రీకాకుళం, ఆగస్టు13 (వార్త):** కేజీబీవీ ప్రిన్సిపాల్స్ అక్రమ బదిలీలు రద్దు చేయాలని, నిబంధనలు పాటించని ఏపీసీని విధులు నుండి తొలగించాలనీ ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జెఎసి రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, యూటీఎఫ్ సీనియర్ నాయకులు కే.విజయగౌరి డిమాండ్ చేశారు. జిల్లా ప్రాజెక్ట్ ఆఫీస్ వద్ద సమగ్ర శిక్షా ఎంప్లాయీస్ జెఎసి, యూటీఎఫ్ , సీఐటీయూ సంయుక్తంగా మూడు సంఘాలు ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని కంచిలి, గార, పొందూరు కేజీబీవీ స్కూల్ ప్రిన్సిపాల్స్‌ను ఎలాంటి విచారణ జరపకుండా, కేవలం స్థానిక ఎమ్మెల్యేల లేఖల ఆధా రంగా బదిలీ చేయడం దారుణమన్నారు. ఇది నిబం ధనను ఉల్లంఘించడమేనన్నారు. మహిళా ఉద్యో గులపై స్థానిక రాజకీయ నాయకులు ఇష్టానుసారంగా దూషించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, వేధింపు లపై ఫిర్యాదు చేయడం మాత్రమే కాకుండా, ఆ వేధిం పులకు సంబంధించిన ఫోన్ ఆడియో రికార్డింగ్స్‌ను




కూడా ఏపీసీకి అందజేసినా, సంబంధిత వ్యక్తులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అన్యాయమ న్నారు. సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి రాజకీయ ఆశీస్సుల కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ, సెలవు రోజుల్లో కూడా ఆదేశాలు జారీ చేసి, రాజకీయ నాయకుల మనసు పొందడానికి కృషి చేస్తు న్నట్టుగా ఈ సంఘటన ద్వారా స్పష్టమవుతోందన్నారు. నిబంధనలు పాటించని ఎస్ఎస్ఏ ఏపీసీని విధులు నుండి తొలిగించాలని వారు డిమాండ్ చేశారు. పొందూరు ప్రిన్సిపాల్‌గా చేసి బదిలీ అయిన ఆర్.సౌమ్య మాట్లాడుతూ ఓ ఎమ్మెల్యే నుండి తనకు ప్రాణహాని ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. ధర్నాకు మద్దతుగా హాజరైన యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు హాజరై అక్రమ బదిలీలకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, యుటిఎఫ్ కోశాధికారి బి.రవి కుమార్, జిల్లా కార్యదర్శి జి.సురేష్, కె.సురేష్, జి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



**జి.సిగడాం,ఆగస్టు 13 (వార్త):** రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని జి.సిగడాం వైఎస్సార్సీపీ మండల మహిళా అధ్యక్షురాలు సర్పంచ్ కంది రమాదేవి ఆందోళన వ్యక్తం చేశారు. శాంతియుతంగా పులివెందులలో జరగాల్సిన ఎన్నికల్లో టీడీపీలో కొందరు వ్యక్తులు అల్లర్లు సృష్టించారని ఆరోపించారు. వైఎస్సార్సీపీ నేతల్ని టార్గెట్ చేసుకుని మరీ దాడులకు తెగబడ్డారని, ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఓటు వేసేందుకు పోలీసుల కాళ్లు పట్టుకున్నా కనికరించకపోవడం దారుణమన్నారు. ఇన్ని అల్లర్లు జరుగుతుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

# చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేయాలి

### *ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి



**మందస, ఆగస్టు 13(వార్త):** మందస, కంచిలి, సోంపేటలలో అవసరమైన ప్రాంతాల్లో చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తలపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమాన్ని, గడిచిన నెలలలో నాటుసారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతినాయుడుతో కలసి అధికారులతో సోంపేట ఎక్సైజ్ స్టేషన్ లో సమీక్ష చేశారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ సంవత్సరంలో నమోదు చేయబడిన కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కేసులు నమోదు చేయబడి పరారీలో, అరెస్ట్ కాని వారి వివరాలు తనిఖీ చేసి తక్షణమే వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన నవోదయం 2.0 లక్ష్యాలను చేరుకోవటానికి తగు సూచనలు చేశారు. సోంపేట ఎక్సైజ్ సర్కిల్ లోని సోంపేట, కంచిలి, మందస మండలాలలోని నాటుసారా గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా చేయటానికి ఆయా గ్రామాలలో అవగాహన సదస్సులు, నేర నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో నాటుసారా అమ్మకాలలో ఉండి, మానివేసిన వారికి ఇతర ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గతంలో నాటుసారా కేసులలో ఉన్న వారిని స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్లు చేయించాలని, కంచిలి, సోంపేట, మందస మండలాల్లో అవసరమైన ప్రాంతాల్లో చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సోంపేట ఎక్సైజ్ సీఐ జి.వి. రమణ, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్, పలాస ఎక్సైజ్ సీఐ మల్లిఖార్జునరావు, టాస్కోర్స్ సీఐ మధుకుమార్ ఎస్సైలు కళ్యాణి, సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉన్న వ్యవస్థల్ని వినియోగించుకుని అభివృద్ధి చెందాలి

### * ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి




**మెళియాపుట్టి ఆగస్టు 13 (వార్త):** ప్రస్తుతం ఉన్న సమాజంలో ఉన్న వ్యవస్థల్ని సద్వినియోగపరుచుకొని ప్రతి ఒక్కరూ ప్రతి ప్రాంతం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని సీతంపేట ఐటిడిఏ పిఓ యశ్వంత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మెళియాపుట్టి మండల కేంద్రంలో గల స్థానిక మండల పరిషత్ కార్యాలంలో పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి, టెక్కలి, సారవకోట తదితర మండలాలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులకు నిర్వహించిన డిస్ట్రిక్ట్ ప్రోసెసింగ్ ల్యాబ్ మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదికర్మయోగితో గిరిజన ప్రాంతాల అభివృద్ధి చెందడంతోపాటు వారి యొక్క జీవన ప్రమాణాలు మరింత మెరుగవాలన్నారు. సచివాలయం వంటి గొప్పవ్యవస్థ ఉందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దానిని వినియోగించుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. కేంద్రప్రభుత్వం దేశంలో 20 లక్షల మంది గిరిజన కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి, వారి స్థితిగతుల మెరుగుకు కృషి చేస్తోందని, ఆ కార్యక్రమంలో భాగంగానే జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమాన్ని మెళియాపుట్టిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరు శిక్షణ తీసుకుని మండల స్థాయిలో శిక్షణ ఇస్తారనీ, అక్కడ వారు గ్రామస్థాయిలో శిక్షణ ఇస్తారన్నారు. దీని ముఖ్యోద్దేశం గిరిజన సంస్కృతి సంప్రదాయాలను సంరక్షించడం, గిరిజన ప్రాంతాల సంక్షేమం, అభివృద్ధి, విద్య, వైద్యం జీవనోపాధి వంటి ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి మెరుగుసాధిలంచాలన్నారు. అలాగే గ్రామాలలోనున్న ప్రతీసమస్యను చర్చించుకుని త్రాగునీరు, రహదారులు, మౌలిక సదుపాయాలు తదితర సమస్యలు తెలుసుకోని సమస్యలు ఉన్న దగ్గర ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయం వంటి వ్యవస్థలో లక్షలమంది పనిచేస్తున్నారనీ అయినప్పటికీ వారి సమస్యలు చెప్పుకోవడానికి గిరిజనులు కార్యాలయాల చుట్టూ తిరిగితే మంచిదికాదన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ రిసోర్స్ పర్సన్ సందీప్ కుమార్, ఎటిడబ్ల్యువో సూర్యనారాయణ, తహసిల్దార్ పాపారావు, ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా ఆయా మండలాలకు చెందిన పలువురు మండలస్థాయి ఉద్యోగులు, ఇతర శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముున్సిపాలిటీలో
## హర్ ఘర్ తిరంగా ర్యాలీ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 13 (వార్త):** పురపాలక సంఘంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛత' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్ స్టాండ్ కూడలి వరకు దేశ భక్తి నినాదాలతో ర్యాలీ చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం కూడలి వద్ద మానవహారం చేశారు ప్రతి ఇంటా మువ్వన్నెల పతకాల రెపరెపలతో జాతీయ సమగ్రత, సమైక్యత భావాలు ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా - హర్ ఘర్ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరేసి, ఫోటోలు తీసుకుని https:harghartiranga.com-volunteer, https: harghartiranga.com/selfie వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేసి, సర్టిఫికెట్ పొందాలని కోరారు. ప్రతి ఇంటి పరిశుభ్రత - ప్రతి ఇంటిపైన జాతీయ జండా ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చు జగన్ , మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.






## సమాజంపై అవగాహన అవసరం


**మందస, ఆగస్టు 13(వార్త):** విద్యార్థులకు సమాజంపై చైతన్యం అవసరమని మందస ఎస్ఐ కె.క్రిష్ణప్రసాద్ అన్నారు. మందస పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మహిళ భద్రతపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ మహిళల భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదక ద్రవ్యాల వలన జరిగే దుష్పరిణామాలు గూర్చి వివరించారు. సైబర్ నేరాలు, శక్తి యాప్ పై అవగాహన కల్పించారు. మహిళ రక్షణకు గల చట్టాలు, చైల్డ్ మ్యారేజ్ లు వంటి అంశాలపై అవగాహన ఏర్పరిచారు. సోషల్ మీడియాలో డిజిటల్ అరెస్టు, అసభ్యకరమైన పోస్టులు, ఫోటో మార్ఫింగ్ వంటి వాటిపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డయల్ 112, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, శక్తి యాప్ ద్వారా అందిస్తున్న సేవలు, ఎస్ఓఎస్ బటన్ వంటి అత్యవసర నెంబర్లపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. విస్తృతంగా మహిళ భద్రత పై అవగాహన కల్పించారు. సంకల్పం, నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మందస ఎస్సై కె కృష్ణ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ తేజేశ్వరరావు, మందస పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## జవాన్ కుటుంబానికి అండగా తోటి జవాన్లు

**పలాస, ఆగస్టు 13 (వార్త):** తమతో పాటే జవాన్‌గా పని చేస్తూ ఈ నెల రెండో తారీఖున మృతి చెందడంతో తోటి జవాన్లు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం పద్మనాపురం గ్రామానికి చెందిన బి ఈశ్వరరావు ఐటీబిపీ 21వ బెటాలియన్ జమ్మూ కశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. మృతి చెందిన జవాన్‌కి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఐటీబిపి తెలుగు జవాన్లు 91 వేలు ఇచ్చి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఐటిబిపి జవాన్లు పి. విజయ్, కె.మురళి మోహన్, షణ్ముఖరావు చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు.

## ఎల్ఆర్ఎస్‌తో సొంతింటి కల నెరవేర్చుకోండి



**పలాస, ఆగస్టు 13 (వార్త):** స్థలం కొన్నట్లు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉంటే ఎల్ఆర్ఎస్‌లో ప్లాట్ ను క్రమబద్ధీకరించుకోవచ్చుని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలియజేశారు. బుధవారం విలేకరులతో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ అనుమతులు లేని లే-అవుట్ లలో జూన్ 30, 2025 తేదీ లోపుగా ప్లాట్ కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు ఎవరైనా ఎల్ఆర్ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకొనుటకు అర్హులని కమిషనర్ తెలియజేశారు. ఈ పథకం యొక్క ఫీజులో చాలా రాయితీలను కూడా ప్రభుత్వం వారు ప్రకటించారని వెల్లడించారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు 10 వేల రూపాయలు తగ్గకుండా ప్రాథమికంగా చెల్లించాలని, ఫీజు మొత్తం 45 రోజుల్లో చెల్లిస్తే 10 శాతం రాయితీ, 45 నుండి 90 రోజులలో చెల్లిస్తే 5 శాతం రాయితీ, మరియు రెగ్యులరైజేషన్ ఫీజు కాకుండా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలలో 7 శాతం రాయితీ కూడా ఉంటుందని చెప్పారు. ఈ అవకాశం అక్టోబర్ 2025 నెల ఆఖరి వరకు ఉంటుందని కమిషనర్ వారు తెలియజేశారు. ఈ పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కలిగించుట కొరకు పురపాలక సంఘంలో గల 22మంది అనాథరైజుడ్ లే-అవుట్ యజమానులతో త్వరలో సమావేశం నిర్వహించి, ఆథరైజ్డ్ చేసుకునేటందుకు గాను వారికి పూర్తి అవగాహన కల్పించుట జరుగుతుందని వెల్లడించారు. ఈ పురపాలక సంఘంలో ప్రజలు కొనేటప్పుడు ఈ పురపాలక సంఘం టౌన్ ప్లానింగ్ విభాగములో సంప్రదించాలన్నారు.

## సుజాత గౌరీ త్యాడికి
## మాజీ మంత్రి అప్పలరాజు పరామర్శ



**పలాస, ఆగస్టు 13 (వార్త):** వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు గౌరీ త్యాడి సతీమణి పలాస కాశీబుగ్గ పురపాలక సంఘం కో ఆప్షన్ సభ్యురాలు సుజాత త్యాడికు రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పరామర్శించారు. స్థానిక తిలక్ నగర్‌లో గల ఆమె నివాసానికి వెళ్లి ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. తనకు ఉన్న వైఎస్సార్ సీపీ కుటుంబంలో అత్యంత సన్నిహితులైన గౌరీ త్యాడి ఒకరని, భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తామని మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్, వైసీపీ నాయకులు కొంచాడ రాజా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## టి.బరంపురంలో ఆధ్యాత్మిక ప్రసంగం

**ఇచ్ఛాపురం, ఆగస్టు13 (వార్త):** టి.బరంపురంలోని సీతారామాలయంలో టీటీడీ నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పండితులు కె.దాలినాయుడు భాగవతంపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. అలాగే సీతారామ ఆంజనేయ భజన బృందం చేసి సంగీత భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్కత వాసు, యంపడ ఉమాపతి, మచ్చ నీలాద్రి, రవీంద్ర కేదారి, లింగయ్య, జగన్నాథం ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సురక్షిత లైంగిక సంబంధాలతో హెచ్ఐవీ నివారణ



**పలాస, ఆగస్టు 13 (వార్త):** సురక్షిత లైంగిక సంబంధాలతోనే హెచ్ఐవీని నివారించవచ్చని ప్రోగ్రామ్ మేనేజర్ ఎం.మాధవరావు, ఎంఐసిటిసి కౌన్సిలర్ రామక్రిష్ణ తెలిపారు. బుధవారం పలాస మండలం కేదారిపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు హెచ్ఐవి ఎయిడ్స్ రోగుల సంఖ్య పెరుగుతుందని దీనిని నివారించడం కోసం మనమందరం కృషి చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం హాసన్ ఉల్లా, వి.కామేశ్వరి, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## 20న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని పర్యటన

**ఇచ్ఛాపురం, ఆగస్టు 13(వార్త):** బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ఈనెల20న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం వీకేపీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. పార్టీలో చేరిన గురుసు పితంబార్, భాస్కర్ రెడ్డి, బలరాంలకు పార్టీ కండువా వేశారు. సమావేశంలో పూర్వ అధ్యక్షులు బిర్లంగి ఉమామహేశ్వరరావు, జిల్లా కోశాధికారి వల్లంపాటి కృష్ణ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంగి లక్ష్మి, జిల్లా కార్యదర్శి బీన వంశీ పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**జలుమూరు, ఆగస్టు 13(వార్త):** జలుమూరులోని లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశామని హెచ్ఎం జీవీ రమణ తెలిపారు. బుధవారం ఉదయం ఏపీపీఎస్ టీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఫిజికల్ సైన్స్ పుస్తకాలను 8, 9, 10 తరగతుల విద్యార్థులకు అందజేశామన్నారు. వీటిని సీబీఏ విధానంలో తయారు చేయటం వలన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయుడు బమ్మిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నేత్ర పరీక్షలు



**జలుమూరు, ఆగస్టు 13(వార్త):** జలుమూరులో ప్రైమరీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. బుధవారం జలుమూరు మండల పిహెచ్సికు చెందిన నేత్ర సహాయ నిపుణులు రామేశ్వరి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో భాగంగా 72 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి దృష్టిలోపం ఉన్నట్లుగా గుర్తించామని ఆమె తెలిపారు. వీరికి ప్రభుత్వం ఉచితంగా కళ్లజోళ్లు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## నలుగురి అరెస్ట్



**నరసన్నపేట/జలుమూరు, ఆగస్టు 13(వార్త):** నరసన్నపేటలో రెండు వేరు వేరు కేసులలో 25.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని టెక్కలి డీఎస్పీ లక్ష్మణ్ తెలిపారు. బుధవారం నరసన్నపేట సర్కిల్ ఆఫీస్ లో ఆయన మాట్లాడారు. నరసన్నపేట సత్యవరం కూడలి వద్ద ముందస్తు సమాచారంతో సౌర శ్రీను వద్ద 21 కేజీలు, మడపాం టోల్ గేట్ వద్ద ఎస్.కె రబీల్ వద్ద 4 కేజీలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులలో నలుగురిని అరెస్టు చేశామన్నారు.

## 19న సామూహిక అష్టలక్ష్మి వ్రతాలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 13 (వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛవతి అమ్మవారి ఆలయ ఆవరణలో శ్రావణ మంగళవారం సామూహిక అష్ట లక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. 17 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని, రుసుం చెల్లిస్తే పూజ కిట్ అందిస్తామని చెప్పారు. అమ్మవారికి మర్దన, అలంకరణ లలితా పారాయణం నిర్వహిస్తామని చెప్పారు.

# అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

### * సీఐటీయూ జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు



**కొత్తూరు, ఆగస్టు 13 (వార్త):** అంగన్వాడీ వర్కర్లకు వేతనాలు పెంచాలని, సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ యూనియన్ సిఐటియు సమావేశం బుధవారం కొత్తూరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆరు సంవత్సరాలుగా అంగన్వాడీల వేతనాలు ఒక్క రూపాయి కూడా పెంచలేదని, డి.ఏ., పి.ఆర్.సి. అమలు చేయడం లేదని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, గర్భిణీలకు, బాలింతలకు, అంగన్వాడీలకు ఎఫ్.ఆర్.ఎస్. రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ కోసం ఇచ్చిన 2జీబీ ర్యామ్ ఫోన్లు 4 సంవత్సరాలు పూర్తవడంతో, అవి ప్రభుత్వ యాప్‌లకు, ఆన్లైన్ పనులకు సపోర్ట్ చేయడం లేదని తెలిపారు. నెట్ సిగ్నల్ సమస్యలు, సర్వర్ సమస్యల వలన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని పదేపదే అడిగినా స్పందన రాలేదని, ట్యాబులు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడంతో పనికిరాని ఫోన్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయాలకు అప్పగించారని తెలిపారు. దేశ వ్యాప్తంగా పోషణ్ ట్రాకర్ ఒకే యాప్‌గా ఉంటే, రాష్ట్రంలో మాత్రం అనవసరంగా ఎక్కువ యాప్‌లు పెడుతున్నారని విమర్శించారు. ఆన్లైన్ పనికి ఒకే యాప్, నాణ్యమైన ట్యాబులు, 5జీ నెట్ అందించాలని కోరారు. ప్రధాన మంత్రి మాతృ వందన పథకాన్ని అంగన్వాడీలకు కొత్తగా అప్పగించరాదని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని సూచించారు. మినీ అంగన్వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చే జీవో ఇవ్వాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలని, హెల్పర్లకు ప్రమోషన్ విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిర్ల. ప్రసాదరావు, ఎస్. ధనలక్ష్మి, డి. అనూరధ, జలజాక్షి, అమ్మాయమ్మ, శ్రీలత, విజయ, భవాని తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో

## ‘పొలం పిలుస్తుంది’



**ఇచ్ఛాపురం,ఆగస్టు 13 (వార్త):** రతకన్న, బిర్లంగి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అధునాతన సాగు పద్ధతులు, పంట సంరక్షణ చర్యలు, సమగ్ర పోషక నిర్వహణ, ఎరువులు మరియు పురుగుమందుల సమయానుకూల, సమర్థవంతమైన వినియోగంపై అవగాహన కల్పించారు. రతకన్న గ్రామంలో రైతులతో పరస్పర చర్చలు నిర్వహించి, బయో-ఫర్టిలైజర్ల వినియోగం, పర్యావరణహిత పురుగుమందుల వాడకం, సకాలంలో పంట పర్యవేక్షణ వంటి అంశాలపై వివరణ ఇచ్చారు. బిర్లంగి గ్రామంలో వరి పంట పొలాలను పరిశీలించి, పంట ఎదుగుదల, పోషక లోపాలు గుర్తించఆరుసలహాలు అందించారు. నీటి నిర్వహణ, కలుపు నియంత్రణ, పురుగుల నియంత్రణ పద్ధతులపై మార్గదర్శకాలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయాధికారి పి పి వి వి అజయ్ కుమార్ మరియు ఏ డి భవానీ శంకర్ రావు పాల్గొని రైతులకు సూచనలు అందించారు. వ్యవసాయశాఖ తరపున రైతులకు పంటకాలమంతా సాంకేతిక సహాయం అందించేందుకు కట్టుబడి ఉంటామని అధికారులు తెలిపారు.

## లైన్ షైనింగ్ విధానంలో నాట్లు నాటండి

**జలుమూరు, ఆగస్టు 13 (వార్త):** ఖరీఫ్ సీజన్లో కొనసాగుతున్న వ్యవసాయ సాగులో లైన్ షైనింగ్ విధానంలో వరి నాట్లు నాటుకోవాలని వ్యవసాయ శాఖ ఏడి ఎల్ వెంకట మధు తెలిపారు. బుధవారం జలుమూరు మండలం కొమనాపల్లి పంచాయితీలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఏవో కింజరాపు రవితో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ ఫల సాయం సాధించేందుకు వరి నాట్లు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎరువులు అధిక మొత్తంలో వాడవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.




## మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని రక్షించండి



**మందస ఆగస్టు 13(వార్త):** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ పిలుపునిచ్చారు. మందస మండలం బాలిగాం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో బాదం, కదంబ, చెర్రీ వివిధ రకాల పండ్ల రకాల మొక్కలు గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో నాటారు. ఈ సందర్భంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పిల్లలకు పర్యావరణ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వేడిగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ సభ్యులు, ఉపాధ్యాయులు కిషోర్ పాత్రో, నగిరి లక్ష్మి, యానాది సుజాత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పెద్దజీయర్ స్వామి తిరునక్షత్ర వేడుకలు

**మందస, ఆగస్టు 13(వార్త):** శ్రీవాసుదేవపెరుమాళుని సన్నిధిలో పెద్దజీయర్ స్వామి తిరునక్షత్ర వేడుకలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. పెద్దజీయర్ స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య భక్తులు జైశ్రీమన్నారాయణ నామజపం చేశారు. వాసుదేవుని గర్భగుడికి ముందర అర్చకులు సచ్చిదానందపాఢి జీయర్ స్వామి పాదుకాపూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

## రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయండి

**ఇచ్ఛాపురం ఆగస్టు 13 (వార్త):** ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో మరింత అభివృద్ధి చేయాలని డిఆర్ యుసిసి సభ్యులు కట్టా సూర్య ప్రకాష్ రావు కోరారు. ఈ మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే డిఆర్‌యుసిసి మొదటి సమావేశం జరిగింది. డిఆర్ఎం అశోక్ త్రిపాఠి, డిసిఎం అనిల్ కుమార్ పాల్గొన్నారు. బరంపురం వైజాగ్ పాసెంజర్ జాడుపూడి, బారువలో హాల్ట్ కల్పించాలని కోరారు. బరంపురం విశాఖపట్నం ఇంటర్ సిటీకి అదనపు కోచ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. బరంపురం, భువనేశ్వర్ ఇంటర్ సిటీలు మధ్య టైం మార్చాలని కోరారు. గుడ్డి పద్ర వద్ద కొత్తగా రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అండర్ పాస్ బ్రిడ్జిలను నాలుగు నెలల్లో పనులు ప్రారంభిస్తామని రైల్వే అధికారుల హామీ ఇచ్చినట్లు చెప్పారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వజ్రోత్సవాల్లో రెడ్‌క్రాస్ సేవలు



**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** జిల్లా ఏర్పాటై 75 ఏళ్ల వజ్రోత్సవాల సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషుల)లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా ఎస్పి కే.వి. మహేశ్వర్ రెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి. జగన్ మోహన్ రావు పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 75 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అలాగే జూనియర్ రెడ్‌క్రాస్, యూత్ రెడ్‌క్రాస్ బృందాలు వజ్రోత్సవాల భాగంగా నిర్వహించిన రన్ ఫర్ శ్రీకాకుళంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు అన్ని విధాల సహకరిస్తాం

*** జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ * నాగావళి హోటల్‌లో పారిశ్రామికవేత్తల సదస్సు**



**శ్రీకాకుళం, ఆగస్టు 13 (వార్త):** జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తే అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హామీ ఇచ్చారు. జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక నాగావళి హోటల్లో బుధవారం నిర్వహించిన పారిశ్రామికవేత్తల సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో భూ సమస్య లేదని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన దరఖాస్తులు సమర్పిస్తే ఏపీఐఐసీ ద్వారా భూముల కేటాయింపు చేస్తామని తెలిపారు. విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, భోగాపురం నుంచి మూలపాడు పోర్ట్ వరకు ఆరు లైన్ల రహదారి నిర్మాణం జరగనున్నందున, సుమారు 193 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్నందున, ఆయా కారిడార్ల వెంబడి పరిశ్రమల నెలకొల్పితే పారిశ్రామికవేత్తలకు ఆదాయంతో పాటు జిల్లా అభివృద్ధికి, నిరుద్యోగ సమస్య నిర్మూలనకు అవకాశం ఉంటుందని వివరించారు. అదేవిధంగా పరిశ్రమల స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల ప్రవేశపెట్టాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో తయారవుతున్న రెడీమేడ్ ఉత్పత్తులకు వాల్యూ ఆడ్ చేయడం ద్వారా మరింత మెరుగైన పర్సన్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. పలాసలో జీడిపప్పు ఉత్పత్తులు, తీరప్రాంతమందు ఆక్వా కల్చర్ ఉత్పత్తులు, జిల్లాలో అధికంగా లభిమయ్యే మామిడి, పనస, జీడి మామిడి తదితర ఉత్పత్తులకు విలువలను జోడిస్తే నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయవచ్చన్నారు. భూమి కేటాయింపును పూర్తి అభివృద్ధి, పాక్షిక అభివృద్ధి, ప్లయిన్ ల్యాండ్ విధానాలలో పారిశ్రామికవేత్తలకు అవసరమైన విధంగా అందజేస్తామన్నారు. ప్రభుత్వ ఖాళీ భవనాలను కూడా తాత్కాలికంగా అందిస్తామని తెలిపారు. ప్రైవేట్ భూములను సైతం పారిశ్రామిక వేత్తలు కొనుగోలుకు సహకరిస్తామని తెలిపారు. స్థానిక శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్రావు మాట్లాడుతూ, 2047 స్వర్ణాంధ్ర సాధన స్థాపనకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ సమయానికి శ్రీకాకుళం జిల్లా మొదటి ఐదు స్థానాలలో ఒకటిగా ఉండాలన్న ఆకాంక్షకు పరిశ్రమల ఏర్పాటు అవసరమన్నారు. సెప్టెంబర్ నాటికి మూలపేట పోర్ట్ పూర్తయ్యే అవకాశం ఉందని, కార్గో టెర్మినల్ ఏర్పాటుకు అధ్యయనం జరుగుతోందని వాటి వల్ల పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కళింగపట్నం పోర్ట్‌లో పాసింజర్ జెట్టి, మరో రెండు మినీ జెట్టీలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ ప్రాంతంలో కార్మిక సమస్య లేదని, అంతర రాష్ట్ర రహదారి సదుపాయం ఉందని, పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే సహకారం అందిస్తామని వివరించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ అహమ్మద్ ఫర్మాన్ ఖాన్, ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, డీఐసీ జనరల్ మేనేజర్ జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, టూరిజం అధికారి నారాయణరావు, సుమారు 50 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన అవసరం



**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ లావాదేవీలు, డిపాజిట్ ఖతాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని శ్రీకాకుళం లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నగరంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో జరిగిన రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శ్రీనివాసరావు పాల్గొని అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ వి.ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేర్చబడాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించాలని, బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ హెడ్ డి.మదన్, రిసోర్స్ పర్సన్స్ ఎస్.హరి, ఎ. హరనాథ్, ట్రైనర్‌లు పి.హేమలత, యు.రాజేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది



**ఆమదాలవలస, ఆగస్టు13 (వార్త):** శ్రీకాకుళం జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారుచేయబడిన ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆమదాలవలస ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పైల రవికుమార్, ఎస్.అరుణ, బంగారు శరత్ కుమారిలు పాఠశాల 8, 9 ,10 తరగతి విద్యార్థులకు ఉచితంగా అందించడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆముదాలవలస మండల విద్యాశాఖ అధికారి కే.ఏ.రాములు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు అందించిన సహకారానికి అభినందనలని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని, సాధించే వరకు కృషి చేయాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పి.రవికుమార్ మాట్లాడుతూ నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత తయారు చేయబడిన స్టడీ మెటీరియల్ మంచి ఫలితాలు ఇస్తుందని, ఫిజికల్ సైన్స్‌ను నిత్యజీవితంలో వినియోగించుకోవాలని ఎస్.అరుణ పేర్కొన్నారు. స్టాఫ్ సెక్రటరీ పి.రామస్వామి నాయుడు, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు పి మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ని వినియోగించుకోవాలని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు గురుగుబిల్లి అప్పారావు, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఎం ఉమా కుమారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు జి కుమారి, జన విజ్ఞాన వేదిక విద్యా విభాగం రాష్ట్ర కన్వీనర్ గొంతి గిరిధర్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వజ్రోత్సవ విజేత శ్రీకాకుళం వెదర్ మ్యాన్

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** జిల్లా ఏర్పడి 75 ఏళ్ల వజ్రోత్సవాల సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో నిర్మాణ పోటీల్లో విజేతలను బుధవారం ప్రకటించారు. శ్రీకాకుళం వెదర్ మేన్ అరవింద్ అత్యుత్తమ ప్రదర్శన చేసి మొదటి బహు మతి గెలుచుకున్నారు. హలో సిక్కోలు ప్రశాంత్ రెండవ బహుమతి సాధించగా, ప్రణవ్ మూడవ బహుమతి పొందారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ విజేతల పేర్లను వెల్లడించారు.

## నేడు జిల్లా స్థాయి పోటీలు

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** జిల్లా వజ్రోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, ప్రసంగం, చిత్రలేఖన పోటీలు గత రెండు రోజులుగా ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఉత్సాహంగా ముగిశాయి. ప్రభుత్వ, మోడల్, సోషల్ వెల్ఫేర్, కస్తూర్బా, ట్రైబల్ వెల్ఫేర్, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ విద్యార్థులు పోటీల్లో తమ ప్రతిభను ఆవిష్కరించారు. ఇందులో అద్భుతమైన ప్రతిభ కనబరిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు బుధవారం ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో తలపడనున్నారు.

## నేడు గ్రామీణ క్రీడా పోటీలు

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** జిల్లా ఏర్పాటై 75 ఏళ్ల వజ్రోత్సవాల రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి వివిధ క్రీడలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు తదితర కార్యక్రమాలు జరగ ౹నున్నాయి. ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో కర్రసాము, సాంగిడీ, మగ్గదార్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వహించ నున్నారు. సుమారు 200 మంది క్రీడాకారులు, 50మంది అధికారులు పాల్గొననున్నారు. అదే రోజు ఉదయం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (మెన్)లో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు విద్యార్థుల ప్రతిభను ఆవిష్కరించనున్నాయి.



## ఎన్ఎస్ఎస్ ర్యాలీ

**పలాస, ఆగస్టు13 (వార్త):** పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు బుధవారం పలాస పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలతో దేశభక్తి నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు మధుర, చరిత్రకారుడు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినాన పాపారావు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలం

**పలాస, ఆగస్టు 13 (వార్త):** రాష్ట్రంలో జడ్పి టిసి ఉప ఎన్నికల జరిగిన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగులుతుందని చెప్పడానికి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలు నిదర్శనంగా నిలు స్తాయని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు అన్నారు. బుధవారం పలాసలో విలేక రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ చంద్రబాబు జేబు సంస్థగా పనిచేస్తుందని ఆయన ఆరో పించారు. దేశంలో ఎన్నికల సరళిలో ఒకప్పుడు భారత ఎన్నికల చీఫ్ కమిషనర్ టీ ఎన్ శేషన్ ఎంతటి శక్తివంతమైన చర్యలు తీసుకువచ్చారో గుర్తించవలసిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బీజేపి చేతిలో కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రంలోనే ఎస్ఈసీ చంద్రబాబు జేబు సంస్థగా పనిచేస్తున్నాయన్నారు. వైయస్సా ర్సీపిని మానసికంగా బలహీనపరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్ని స్తుందన్నారు. ఈవీఎంలతో చంద్రబాబు గెలిచాడనే భావన ప్రతి ఒక్కరిలో ఉంద న్నారు. ఉప ఎన్నికలు జరిగిన తీరు చూస్తుంటే రాష్ట్ర ఎన్నికల సంఘం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కనుసన్నల్లో పనిచేస్తుందని తేట తెల్లం అవుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలు వైఎస్ఆర్సిపి ఎన్నికల ఏజెంట్లను ఎన్నికల కేంద్రాల పోలింగ్ బూత్‌లకు రానివ్వకుండా అడ్డుకున్న తీరును ప్రజలు చూశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ టిడిపి నాయకులు దౌర్జ న్యాలకు పాల్పడ్డారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల మనసుతో ఓటు గెలుచు కోవాలి గాని, భయపెట్టి కాదని ఆయన హితవు పలికారు.

## సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



**బూర్జ, ఆగస్టు 13(వార్త):** ఆంధ్రప్రదేశ్ మార్క్ఫెడ్ డైరెక్టర్ అనేపు రామకృష్ణ నాయుడు తన సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. మెయిన్ రోడ్డులో నీలాదేవిపురం, నీలంపేట జంక్షన్ వద్ద భారీగా గుంటలు పడ్డాయి. దీంతో వాహనచోదకులు ప్రమాదా లకు గురవుతున్నారు. విషయం తెలుసుకున్న రామకృష్ణ నాయుడు సొంత నిధులతో ఆ గుంతలను పూడ్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రోడ్లు కనీసం మరమ్మత్తులు కూడా చేయకుండా వదిలేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రహదారులను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

## కేఆర్ స్టేడియంలో ఎగ్జిబిషన్ స్టాల్స్ ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, ఆగస్టు 13 (వార్త):** జిల్లా వజ్రోత్సవాల వేడుకల్లో భాగంగా బుధవారం సాయం త్రం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్, ఎగ్జి బిషన్‌ను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ ప్రారంభించారు. శ్రీకాకుళం జిల్లా సంప్రదాయ హస్తకళలు, స్థానిక కళాకారుల కృషిని ప్రతిబింబించే ప్రత్యేక స్టాళ్లు, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయ పరికరాలు, పర్యాటక ప్రదర్శనలు, విద్యా విభాగం ప్రాజెక్టులు, సాంస్కృతిక విభాగం ఆవిష్కరణలు ఆకట్టుకుంటున్నాయి. జిల్లాలోని సొంత ఉత్పత్తులు, హస్తకళ వస్తువులు, స్థానిక ఆహార పదార్థాల స్టాళ్లు సందర్శకులను రుచులతో, రంగులతో అలరిస్తున్నాయి. ఈ ఎగ్జిబిషన్ వజ్రోత్సవాల ముగింపు వరకు ప్రతిరోజూ సాయంత్రం సందర్శకులకు అందుబాటులో ఉండనుంది.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546